

TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్



WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354



హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-265 | పేజీలు:-4 | బుధవారం 09-09-2026

Hydrabab | Editer name : varudu sujatha | volume:01, | issue:265 | pages:04 | Wendesday - 09-09-2026


# ఫాంహౌస్ పరిసరాల్లో హైటెన్షన్

- అసెంబ్లీ నుంచి కేసీఆర్ ఫాంహౌస్ కు బయల్దేరిన కేటీఆర్, హరీశ్ రావు..
- కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి కాంగ్రెస్ ఎస్సీ విభాగం పిలుపు
- కాంగ్రెస్ వాహనాలపై బీఆర్ఎస్ కార్యకర్తల రాళ్ల దాడి
- రోడ్డుపైనే తోపులాటకు దిగిన ఇరు వర్గాలు




శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యల దుమారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ వద్ద దాడులు, ప్రతిదాడులకు దారితీసింది. ఓవైపు

## మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?

- దళిత వర్గానికి చెందిన స్పీకర్ కు గౌరవం ఇవ్వడం లేదన్న సీతక్క
- సబితను తోసింది ఎవరో వీడియోల్స్ చూస్తే తెలుస్తుందన్న మంత్రి
- మహిళా పోలీసు అధికారులపై బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని వెల్లడి



శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత హేయమైన, - మిగతా 2 లో

## కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది' కేటీఆర్ సంచలన ఆరోపణలు



- కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి కార్యక్రమంపై కేటీఆర్ ధ్వజం
- కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని విమర్శ
- ప్రభుత్వంపై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్
- దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని - మిగతా 2 లో

## చంద్రబాబు అరెస్ట్‌కు మూడేళ్లు రేపు 'నిజం గెలిచింది'

కార్యక్రమానికి పిలుపునిచ్చిన నారా లోకేశ్



- రేపు 53 దీపాలు వెలిగించండి.. టీడీపీ శ్రేణులకు లోకేశ్ కీలక సందేశం
- పార్టీ, పర్సనల్, ప్రభుత్వం అనే మూడు 'పీ'ల సూత్రాన్ని నేతలు పాటించాలని దిశానిర్దేశం
- కార్యకర్తల పోరాటాలు, త్యాగాల వల్లే టీడీపీ అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్య
- వైసీపీ దుష్ప్రచారాలను ఐక్యంగా తిప్పికొట్టాలని శ్రేణులకు సూచన
- ఇది టీడీపీ 3.0 వెర్షన్.. అహంకారం వీడి సేవ చేయాలని నేతలకు హితవు

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుకు - మిగతా 2 లో

## ఎల్‌నినో స్పీడ్ బ్రేకర్ లాగా వచ్చింది



- చంద్రబాబు నాయకత్వంలో ఎదుర్కొంటాం: మంత్రి అచ్చెన్నాయుడు
- ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో 56 శాతం వర్షపాతం లోటు
- విపత్కర పరిస్థితుల్లో చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వం అందిస్తున్నారన్న అచ్చెన్న
- రైతులను గొడ్డలి పార్టీ నేతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం 46 లక్షల మంది రైతులకు పంటల బీమా కల్పించిందని వెల్లడి

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా - మిగతా 2 లో

# వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు




ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు పిలుపునిచ్చారు.

- పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి: ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని సీఎం ఆదేశం
- ఎమ్మార్పీ కంటే ఎక్కువకు మద్యం అమ్మితే కఠిన చర్యలని హెచ్చరిక
- ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచన
- 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన పనులకు ఆమోదం
- టెక్నాలజీ సాయంతో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

# ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే

- ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు పడిపోతాయన్న ట్రంప్
- గ్యాలన్ పెట్రోల్ ధర 2 డాలర్ల కంటే తక్కువకు వస్తుందని జోస్యం
- ట్రూత్ సోషల్ వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించిన అధ్యక్షుడు
- ఇరాన్ ఇంధన వనరులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఇరాన్ హెచ్చరిక
- ప్రస్తుతం అమెరికాలో గ్యాలన్ పెట్రోల్ ధర 4.15 డాలర్లుగా ఉంది



ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు భారీగా పడిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్యాసోలిన్ ధర గ్యాలన్‌కు 2 డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇరాన్‌తో యుద్ధంలో మనం గెలిచినప్పుడు, - మిగతా 2 లో

## నా కొడుకుని చూసి చాలా గర్విస్తున్నా



- మహిళల గౌరవంపై విజయ్ తీసుకున్న నిర్ణయాలు సంతోషాన్ని ఇచ్చాయన్న చంద్రశేఖర్
- ప్రతిపక్షాల విమర్శలను విజయ్ తిప్పికొట్టిన తీరు సంతోషాన్ని ఇచ్చిందని వెల్లడి

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ చుట్టూ తిరుగుతున్న రాజకీయ, వ్యక్తిగత వివాదాల వేళ విజయ్ తండ్రి, సీనియర్ దర్శకుడు - మిగతా 2 లో

# నా వడోదరా అద్భుతం ప్రధాని మోదీ భావోద్వేగం

- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
- వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ
- పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్




గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం

## ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లపై యూకే కఠిన చర్యలు.. వాణిజ్యంపై నిషేధం

- వెస్ట్ బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లపై యూకే వాణిజ్య నిషేధం
- పాలస్తీనియన్లపై జాతి నిర్మూలన జరుగుతోందన్న బ్రిటన్ విదేశాంగ మంత్రి
- యూకే నిర్ణయానికి ఫ్రాన్స్, కెనడా మద్దతు.. పలు యూరప్ దేశాలూ ఇదే బాటలో
- నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఇజ్రాయెల్, అమెరికా



అంతర్జాతీయ వేదికపై ఇజ్రాయెల్‌కు భారీ దౌత్యపరమైన ఎదురుదెబ్బ తగిలింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లతో వాణిజ్య సంబంధాలపై బ్రిటన్ (యూకే) ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ సెటిల్‌మెంట్ల నుంచి వచ్చే అన్ని రకాల వస్తువుల దిగుమతితో పాటు ఫైనాన్సింగ్, - మిగతా 2 లో

## ట్రంప్ మూడోసారి అధ్యక్షుడయ్యే అవకాశం ఉందన్న జియాంగ్

- 2027పై జియాంగ్ జ్యూకిన్ సంచలన అంచనాలు
- ట్రంప్ మరోసారి అధికారంలోకి.. అమెరికా ముక్కలు.. 'చైనా నోస్ట్రడామస్' సంచలన జోస్యాలు
- పశ్చిమాసియాలో అమెరికా భూతల యుద్ధం చేస్తుందన్న జియాంగ్
- అమెరికాలో మళ్లీ తప్పనిసరి సైనిక సేవ రావచ్చని అంచనా
- అమెరికాలో అంతర్యుద్ధ పరిస్థితులు రావచ్చని హెచ్చరిక



భవిష్యత్తు ఎలా ఉండబోతోంది? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే ప్రయత్నాలు ఎప్పటి నుంచో జరుగుతూనే ఉన్నాయి. అయితే కొన్ని అంచనాలు మాత్రం సోషల్ మీడియాలో ఒక్కసారిగా కలకలం రేపుతుంటాయి. - మిగతా 2 లో

నిజం
దృష్టి తెలుగు న్యూస్
TG/TEL/25/A3731
బుధవారం 09-09-2026

# ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లపై యూకే కఠిన చర్యలు.. వాణిజ్యంపై నిషేధం

మొదటిపేజీ తరువాయి - నిర్మాణ రంగం వంటి సేవలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. బ్రిటన్ తీసుకున్న ఈ కీలక నిర్ణయానికి ఫ్రాన్స్, కెనడా సైతం మద్దతు ప్రకటించడమే కాకుండా, తాము కూడా ఈ నిషేధంలో భాగస్వామ్యం పంచుకోనున్నట్లు వెల్లడించాయి. వెస్ట్ బ్యాంక్‌లోని పలు ప్రాంతాల్లో 'సెటిలర్ టెర్రరిస్టులు' పాలస్తీనియన్లపై జాతి నిర్మూలనకు పాల్పడుతున్నారని బ్రిటన్ విదేశాంగ మంత్రి ఎడ్ మిలిబాండ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలస్తీనా ప్రజల ఇళ్లను కూల్చివేయడం, రహదారులు, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడం వంటి చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ సమాజం కళ్లముందే పాలస్తీనాలో జరుగుతున్న ఈ పరిణామాల పట్ల తాను సిగ్గుపడుతున్నానని ఆయన పేర్కొన్నారు. ప్రధాని ఆండీ బర్న్‌హమ్ నేతృత్వంలోని లేబర్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇజ్రాయెల్ విషయంలో యూకే తన విదేశాంగ విధానంలో తీసుకొచ్చిన అతిపెద్ద మార్పుగా దీనిని విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఏడాది బ్రిటన్ ప్రభుత్వం పాలస్తీనాను ఒక స్వతంత్ర దేశంగా గుర్తించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. బ్రిటన్ నిర్ణయంపై ఇజ్రాయెల్, అమెరికా దేశాలు తీవ్రంగా స్పందించాయి. ఇది 'తీవ్రమైన తప్పుడు అంచనా' అని, తమ ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ మండిపడ్డారు. "బ్రిటన్ మాకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే, మేము కూడా బ్రిటన్‌కు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ హెచ్చరించారు. ఇజ్రాయెల్‌లోని అమెరికా రాయబారి మైక్ హకబీ ఈ చర్యను 'యూదు ప్రజలపై చూపిస్తున్న వివక్ష'గా అభివర్ణించారు. దీనికి ప్రతిగా అమెరికా నుంచి ప్రతీకార చర్యలు ఉండవచ్చని ఆయన సంకేతాలిచ్చారు. ఈ ఉద్రిక్త పరిణామాల నేపథ్యంలో, బ్రిటన్ ప్రధాని ఆండీ బర్న్‌హామ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సోమవారం ఫోన్లో మాట్లాడినట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది.

## ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే

మొదటిపేజీ తరువాయి - మిగతావన్నీ పడిపోతున్నట్లే చమురు ధరలు కూడా వేగంగా పడిపోతాయి. మొదట గ్యాలన్ ధర మూడు డాలర్లకు, ఆ తర్వాత రెండు డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుంది. ఇదంతా చాలా వేగంగా జరిగిపోతుంది. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయలేదు. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (ఎంఏజీఏ)!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో గ్యాసోలిన్ సగటు ధర గ్యాలన్‌కు సుమారు 4.15 డాలర్లుగా ఉంది. లేబర్ డే సమయంలో ఇది రికార్డు స్థాయి కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 97 డాలర్ల వద్ద, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) 92 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ కూడా ఘాటుగా స్పందించింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ మాట్లాడుతూ.. తమ దేశ ఇంధన వనరులపై దాడి చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇరాన్ ఆయిల్, గ్యాస్ ఉత్పత్తి వ్యవస్థలు బహిరంగంగానే ఉన్నాయని, అయితే అమెరికా ఆస్తులు కూడా అదే విధమైన బలహీనతను పంచుకుంటాయని ఆయన గుర్తుచేశారు. గతంలో ఇరాన్ ఆయిల్ ట్యాంకర్ల విషయంలో అమెరికా చేసిన వ్యాఖ్యలను, దానికి తాము ఇచ్చిన సమాధానాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇదిలా ఉంటే.. ఇరాన్‌కు చెందిన నౌకలపై దాడులకు సంబంధించి అమెరికా సెంట్రల్ కమాండ్ (జజుచీజూవీ) అధికారులు చర్చలు జరుపుతున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, ఈ వివాదం ఎప్పుడు ముగుస్తుందో, ప్రపంచ ఇంధన మార్కెట్లపై దాని ప్రభావం కచ్చితంగా ఎలా ఉంటుందో అనే దానిపై ట్రంప్ వ్యాఖ్యలు మినహా స్వతంత్రంగా ఎలాంటి ధ్రువీకరణ లేదు.

## నా కొడుకుని చూసి చాలా గర్విస్తున్నా

మొదటిపేజీ తరువాయి - ఎస్.ఏ. చంద్రశేఖర్ చేసిన తాజా వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఇటీవల జరిగిన పలు రాజకీయ పరిణామాలు, అసెంబ్లీ వ్యాఖ్యల అనంతరం మాట్లాడిన ఆయన... తన కొడుకుని చూసి తాను ఎంతో గర్వపడుతున్నాను అంటూ కుమారుడికి పూర్తి మద్దతుగా సంచలన ప్రకటన చేశారు. గతంలో విజయ్‌తో ఉన్న విభేదాలు, వ్యక్తిగత వివాదాల వల్ల దూరంగా ఉంటున్నారనే ప్రచారానికి చెక్ పెడుతూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆయన విజయ్ వైఖరిని గట్టిగా సమర్థించారు. మహిళల గౌరవం, రాజకీయ మర్యాదలపై సభలో విజయ్ తీసుకున్న స్పష్టమైన నిర్ణయాలు, ప్రతిపక్ష విమర్శలను తిప్పికొట్టిన తీరు పట్ల ఒక తండ్రిగా తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. తమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న చవకబారు ఆరోపణలను ప్రజలు నమ్మరని, కొడుకు విజయాన్ని, పట్టుదలను చూసి గర్విస్తున్నానని ఎస్.ఏ. చంద్రశేఖర్ స్పష్టం చేశారు. తండ్రి నుంచి వచ్చిన ఈ బహిరంగ మద్దతుతో టీవీకే వర్గాలు, విజయ్ అభిమానుల్లో సరికొత్త ఉత్సాహం నిండింది.

## కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'.. కేటీఆర్ సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని.. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.

## మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?

మొదటిపేజీ తరువాయి - అనుచిత వ్యాఖ్యలు చేసి, ఇప్పుడు ఏమీ ఎరుగనట్లు తప్పించుకోవాలని చూస్తున్నారని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "సభలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వకపోగా, గతంలో ఎప్పుడో మరణించిన ఆయన మాతృమూర్తిని ఉద్దేశించి అంత నికృష్టమైన భాష మాట్లాడటం ఏ రకమైన సంస్కారం?" అని నిలదీస్తూ కంటతడి పెట్టారు. సీతక్క ఆవేదన చూసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకోవడంతో వాతావరణం అత్యంత గంభీరంగా మారింది. సభలో ప్రతిపక్ష నేతల తీరుపై మండిపడ్డ సీతక్క... "సబితా ఇంద్రారెడ్డిని నిజంగా తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుంది. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టుకుని రావడం ఏంటి? హరీశ్ రావు మహిళల ముందు బట్టలు విప్పుతారా?" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. "మహిళా ప్రజాప్రతినిధులను సురక్షిత ప్రాంతానికి పంపి, ఆ తర్వాత పురుష నేతలు నిరసనకు రావడం పద్ధతి. కానీ మహిళలను అడ్డుగా పెట్టుకుని రాజకీయం చేయడం దారుణం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న మహిళా పోలీస్ అధికారులపై బీఆర్ఎస్ నేతలు చేయిచేసుకుని, దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని, చట్టాన్ని ఉల్లంఘించి పోలీసులను కొట్టిన ఎమ్మెల్యేలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టసభలు దేవాలయం లాంటివని, బీఆర్ఎస్ మహిళా నేతలు ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. "సొంత చెల్లెలు కవితను పార్టీ నుంచి బహిష్కరించినప్పుడు లేని బాధ, హరీశ్ రావును ఏదైనా అంటే ఎందుకు వస్తోంది?" అని సీతక్క బీఆర్ఎస్ నేతలను సూటిగా ప్రశ్నించారు.



# నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

మొదటిపేజీ తరువాయి - కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. "ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి.వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

# ఫాంహౌస్ పరిసరాల్లో హైటెన్షన్

మొదటిపేజీ తరువాయి - అసెంబ్లీలో ఉద్రిక్తతలు కొనసాగుతుండగానే, తీవ్ర పరిణామాల సమాచారం అందుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీ సమావేశాల నుంచి నేరుగా ఎర్రవల్లి ఫాంహౌస్‌కు బయల్దేరారు. స్పీకర్ వివాదం, సభలో అసెంబ్లీ గేటు వద్ద మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసుల ప్రవర్తన, అభ్యంతరకర భాషపై తదుపరి కార్యాచరణను అధినేత కేసీఆర్‌తో చర్చించి ఆయన దిశానిర్దేశం తీసుకోనున్నారు. మరోవైపు, స్పీకర్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఎస్సీ విభాగం నేతలు కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి పిలుపునిస్తూ వెయ్యి డప్పులతో బయల్దేరడంతో పరిస్థితి దారితప్పింది. మర్కుక్ మండలం



దామరకుంట వద్ద ఫాంహౌస్ వైపు వస్తున్న కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్‌ను బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకోవడంతో తీవ్ర ఘర్షణ చెలరేగింది. కాంగ్రెస్ నేతల వాహనాలపై బీఆర్ఎస్ కార్యకర్తలు రాళ్ల దాడికి పాల్పడటంతో ఇరువర్గాలు రోడ్డుపైనే తీవ్ర తోపులాటకు దిగాయి. పరిస్థితి తీవ్రం కావడంతో పోలీసులు రంగంలోకి దిగి ఫాంహౌస్ పరిసర ప్రాంతాలలో ముందస్తుగా 144 సెక్షన్ విధించారు. వెంకటాపూర్, ఎర్రవల్లి శివారు దారుల్లో భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. నిరసనకారులు ఫాంహౌస్ దరిదాపుల్లోకి రాకుండా పహారా పెంచి, వందలాది మంది పోలీసులతో బందోబస్తును కట్టుదిట్టం చేశారు.

# ట్రంప్ మూడోసారి అధ్యక్షుడయ్యే అవకాశం ఉందన్న జియాంగ్

మొదటిపేజీ తరువాయి - ఇప్పుడు అలాంటి చర్చకు కారణమయ్యారు చైనా-కెనడాకు చెందిన విద్యావేత్త ప్రొఫెసర్ జియాంగ్ జ్యాకిన్. 'చైనా నోస్ట్రడామస్'గా పేరుగాంచిన ఆయన.. 2027లో అమెరికా ఎదుర్కొనే పరిణామాలపై చేసిన అంచనాలు ఇప్పుడు వైరల్‌గా మారాయి.

### యుద్ధంతో మొదలై.. సంక్షోభంగా మారుతుందా?

జియాంగ్ అంచనాల ప్రకారం పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు మరింత ముదిరే అవకాశం ఉంది. వైమానిక దాడులతో సమస్య పరిష్కారం కాకపోతే అమెరికా నేరుగా భారీ స్థాయిలో భూతల యుద్ధంలోకి దిగే పరిస్థితి రావచ్చని ఆయన భావిస్తున్నారు. ఈ యుద్ధం ఏళ్ల తరబడి కొనసాగుతుందని చెబుతున్నారు.

### అమెరికాలో మళ్లీ సైనిక నియామకాలా?

యుద్ధం సుదీర్ఘంగా సాగితే అమెరికా సైన్యంలో సిబ్బంది కొరత ఏర్పడొచ్చని జియాంగ్ అంచనా. దీంతో తప్పనిసరి సైనిక సేవకు సంబంధించిన చట్టపరమైన వ్యవస్థను 2027 నాటికి సిద్ధం చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. యువతను సైన్యంలోకి తీసుకునే పరిస్థితి రావచ్చని అన్నారు.

### ఐసీఈకి మరింత అధికారం?

అమెరికాలో అంతర్గత పరిస్థితులు కూడా ఉద్రిక్తంగా మారొచ్చని ఆయన అంచనా వేశారు. ఇమ్మిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థ ఐసీఈ అధికారాలు మరింత పెరగవచ్చని అన్నారు. ప్రధాన నగరాల్లో నేషనల్ గార్డ్ మోహరింపులు తరచుగా కనిపించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### చమురు షాక్

హర్మూజ్ జలసంధిలో రవాణాకు అంతరాయం ఏర్పడితే దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంటుందని జియాంగ్ చెబుతున్నారు. చమురు, గ్యాస్, ఎరువుల ధరలు భారీగా పెరగొచ్చని అంచనా వేశారు. సరఫరా వ్యవస్థలు దెబ్బతింటే ఆహార కొరత, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందన్నారు.

### అమెరికాలో 'సివిల్ వార్' పరిస్థితులా?

ఆర్థిక ఇబ్బందులు, తప్పనిసరి సైనిక సేవపై వ్యతిరేకత, వీధుల్లో భద్రతా బలగాల మోహరింపులు కలిసి అమెరికాలో తీవ్ర అశాంతికి దారితీయొచ్చని జియాంగ్ అభిప్రాయపడ్డారు. 2027లో అంతర్యుద్ధానికి దారితీసే పరిస్థితులు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు.

### ట్రంప్‌నకు మూడోసారి అవకాశం ఉంటుందా?

జియాంగ్ మరో సంచలన అంచనా కూడా వెలువరించారు. డొనాల్డ్ ట్రంప్ మూడోసారి అమెరికా అధ్యక్షుడయ్యే అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణ ప్రకారం ఒక వ్యక్తి రెండు పర్యాయాలకు మించి అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి వీల్లేదు. అయినప్పటికీ ట్రంప్ మూడోసారి అధికారంలోకి రావచ్చని జియాంగ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

### అమెరికా విడిపోతుందా?

అమెరికాలో అంతర్యుద్ధం జరిగితే దేశం చిన్న చిన్న ప్రాంతాలుగా విడిపోయే పరిస్థితి రావచ్చని ఆయన మరోసారి వ్యాఖ్యానించారు. దీన్నే 'బాల్కనైజేషన్'గా పేర్కొన్నారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత అమెరికా క్రిస్టియన్ ఏఐ థియోక్రసీగా మారుతుందని కూడా ఆయన అంచనా వేశారు. ఆస్టిన్ భవిష్యత్తులో అమెరికాకు కొత్త కేంద్రంగా మారొచ్చని.. న్యూయార్క్, లాస్ ఏంజెల్స్ ప్రాధాన్యం తగ్గొచ్చని అన్నారు. అయితే ఇవన్నీ జియాంగ్ జ్యాకిన్ చేసిన అంచనాలు మాత్రమే. వాటికి కచ్చితమైన ఆధారాలు ఉన్నాయని చెప్పలేం. భవిష్యత్తులో అవే పరిణామాలు జరుగుతాయని నిర్ధారించేందుకు ప్రస్తుతం ఎలాంటి ఆధారం లేదు. అందుకే ఈ వ్యాఖ్యలను విశ్లేషణలు, అంచనాలుగానే చూడాలి.

# చంద్రబాబు అరెస్ట్‌కు మూడేళ్లు.. రేపు 'నిజం గెలిచింది'

మొదటిపేజీ తరువాయి - రేపటితో (సెప్టెంబర్ 9) మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 'నిజం గెలిచింది' పేరిట రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. చంద్రబాబును 53 రోజుల పాటు అక్రమంగా జైల్లో నిర్బంధించినందుకు నిరసనగా, ఆయన నిర్దోషిగా బయటకు వచ్చినందుకు గుర్తుగా పార్టీ కార్యాలయాలు, ఇళ్లు, బూత్ స్థాయిలో 53 దీపాలు వెలిగించి, ఆ రోజును 'బ్లాక్ డే'గా పాటించాలని ఆయన శ్రేణులకు సూచించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన లీడర్‌షిప్ కాంక్లేవ్ ముగింపు సభలో లోకేశ్ ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. కార్యకర్తల పోరాటాలు, త్యాగాల పునాదులపైనే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందని స్పష్టం చేశారు. "ఒక తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య, మంజుల వంటి కార్యకర్తలపై గత ప్రభుత్వం దాడులు చేసింది. కొందరిని హతమార్చింది. వారి త్యాగాల వల్లే మనం ఇవాళ నాయకులుగా ఉన్నాం. ఈ విషయాన్ని ఎవరూ మర్చిపోవద్దు" అని ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు. నాయకులకు శిక్షణ ఇచ్చేందుకు, ప్రజలకు మరింత చేరువయ్యే వ్యూహాలపై చర్చించేందుకు ప్రతి మూడు నెలలకోసారి ఇలాంటి కాంక్లేవ్‌లు నిర్వహిస్తామని తెలిపారు.

### నేతలకు 'త్రీ-పీ' మంత్రం

నాయకులంతా మూడు 'పీ'ల (పార్టీ, పర్సనల్, ప్రభుత్వం) సూత్రాన్ని తప్పక పాటించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. వ్యక్తిగతంగా (పర్సనల్) ప్రజలకు, కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండాలని, మానవత్వం, అణకువతో వ్యవహరించాలని హితవు పలికారు. "ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలి. ప్రధాని మోదీ గారి నుంచి నేను ఈ విషయం నేర్చుకున్నాను. ఆయన నా నుంచి కూడా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు. మనం కూడా విమర్శలను స్వీకరించి మార్పు చేసుకోవాలి" అని అన్నారు. రెండో 'పీ' అయిన పార్టీ విషయంలో కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాలని, అలకబూనిన వారిని దగ్గరకు తీసుకోవాలని సూచించారు. ఇక మూడో 'పీ' అయిన ప్రభుత్వం గురించి మాట్లాడుతూ.. నేతలు కేవలం పోస్ట్ ఆఫీసుల్లా కాకుండా, తమ నియోజకవర్గాల్లోని సమస్యల పరిష్కారానికి చొరవ చూపే లీడర్లలా వ్యవహరించాలని కోరారు. పాఠశాలలు, ఆసుపత్రులను తనిఖీ చేస్తూ ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించాలని ఆదేశించారు.

### వైసీపీ దుష్ప్రచారంపై ఐక్య పోరాటం

వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను ఐక్యంగా తిప్పికొట్టాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ రెడ్డి. డీఎస్సీపై మేం చిత్తశుద్ధితో 16 వేల పోస్టులు భర్తీ చేశాం. ఈ ఐదేళ్లలో 30 వేల పోస్టులు భర్తీ చేస్తాం. పోలీస్ నియామకాల్లోనూ అంతే. అయినా మనపైనే విమర్శలు చేస్తున్నారు. వాస్తవాలను ప్రజలకు వివరించాలి" అని అన్నారు. సొంత బాబాయి హత్య కేసు, లిక్కర్ స్కామ్ గురించి మాట్లాడని జగన్.. కేవలం డీఎస్సీపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వెర్షన్ అని, 'నో ఇగో, ఓన్లీ సర్వీస్' అనే నినాదంతో పనిచేయాలని లోకేశ్ స్పష్టం చేశారు. "పార్టీ నిర్ణయం తీసుకున్నాక అందరూ కట్టుబడి ఉండాలి. అహంకారం వద్దు, కలిసికట్టుగా రాష్ట్రాన్ని, పార్టీని నడిపిద్దాం" అని ఆయన ముగించారు. తన ఎదుగుదలకు కారణం కార్యకర్తల సహకారమేనని లోకేశ్ పేర్కొన్నారు.

# ఎల్‌నినో స్పీడ్ బ్రేకర్ లాగా వచ్చింది

మొదటిపేజీ తరువాయి - ఉందని, ఇది అభివృద్ధికి స్పీడ్ బ్రేకర్ లాగా పరిణమించిందని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అయితే, ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వంలో ఈ విపత్తును ఎదుర్కొని రైతులకు అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ చర్యలపై ప్రసంగించారు. ఎల్‌నినో కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 56 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని జిల్లాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉందని, అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశంలో 70 శాతం, చిత్తూరులో 65 శాతం, విశాఖపట్నంలో 60 శాతం వర్షపాతం లోటు ఉందని గణాంకాలతో సహా వివరించారు. రాష్ట్రంలోని 680 మండలాల్లో వర్షాలు లేక కరవు ఛాయలు అలుముకున్నాయని తెలిపారు. అయితే, ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసి గత ఏడాదే చెరువులను నింపడం వంటి ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. ఈ కష్టకాలంలో కొందరు 'గొడ్డలి పార్టీ' నాయకులు రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని అచ్చెన్నాయుడు విమర్శించారు. గతంలో పట్టిసీమను వ్యతిరేకించి, ఐదేళ్ల పాటు ఉచిత పంటల బీమా అని చెప్పి కనీసం ప్రీమియం కూడా చెల్లించని వారు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 46 లక్షల మంది రైతులకు పంటల బీమా సౌకర్యం కల్పించిందని, ఇప్పటికే రూ.4,800 కోట్లు బీమా చేశామని స్పష్టం చేశారు. 27 నెలల క్రితం అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నమైన రాష్ట్రాన్ని చంద్రబాబు మళ్లీ గాడిన పెట్టారని అచ్చెన్నాయుడు కొనియాడారు.గతంలో రాజమండ్రి సూపర్ సైక్లోన్, శ్రీకాకుళంలో తిత్లీ తుపాను వంటి భయంకరమైన విపత్తులను చంద్రబాబు సమర్థంగా ఎదుర్కొన్నారని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. 30 ఏళ్ల క్రితమే నీటి సమస్యపై ఆయన దృష్టి సారించారని, 2014-19 మధ్య సాగునీటి ప్రాజెక్టులపై రూ.65 వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. 2019లో టీడీపీ గెలిచి ఉంటే రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు పూర్తయ్యేవని అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధులు వాస్తవాలు గ్రహించి రైతులకు ధైర్యం చెప్పాలని ఆయన సూచించారు.

# వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు

మొదటిపేజీ తరువాయి - రెండోరోజు లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ప్రసంగించిన ఆయన, కొన్ని నియోజకవర్గాలు పౌర సేవల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నాయని, అన్ని నియోజకవర్గాలు ఆ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని, దీనివల్ల ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకుంటున్నామని చంద్రబాబు గుర్తుచేశారు. ఎక్కడైనా ఇసుక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతే కఠినంగా అడ్డుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసి, నకిలీ బ్రాండ్లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇప్పుడు మద్యం విక్రయాల్లో పారదర్శకత తీసుకొచ్చామని, ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో అవకతవకలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు.

### ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టండి..

ప్రభుత్వంపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలను వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచించారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అనేక సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తున్నామని, క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రమైన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గాల్లోని దీర్ఘకాలిక సమస్యలను సుమోటోగా స్వీకరించి పరిష్కరించాలని, తద్వారా ఎమ్మెల్యేలకు ప్రజల్లో మంచి పేరు వస్తుందని అన్నారు. ప్రజల సమస్యల పట్ల మానవత్వంతో స్పందిస్తే సానుకూల దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, 2027 మార్చి నాటికి భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నామని, గత మూడేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని గుర్తుచేశారు. గత సమావేశంలో ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలను సమీక్షించి, 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన 616 అభివృద్ధి పనులను మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

## భాగ్యనగరంలో సెప్టెంబర్ 25న గణేష్ నిమజ్జన వేడుకలు



**నిజం న్యూస్ హైదరాబాద్ సెప్టెంబర్ 8:** హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనాన్ని సెప్టెంబర్ 25న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నగరవ్యాప్తంగా దాదాపు 1.5 లక్షల విగ్రహాల నిమజ్జనం కోసం 103 చెరువుల వద్ద జీహెచ్ఎంసీ, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు, భద్రతా చర్యలు చేపడుతున్నారు. గత నిమజ్జనాల్లో మిగిలిన అన్ని చెరువుల్లో విగ్రహాల నిమజ్జనం చేసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

## గణేష్ మండప నిర్వాహకులకు సూచనలు జారీ చేసిన వలిగొండ SI శ్రీకాంత్ రెడ్డి




**ఉమ్మడి నల్లగొండ జిల్లా నిజం న్యూస్ రిపోర్టర్ భూతం శ్రీకాంత్,సెప్టెంబర్ 08:** వినాయక చవితి పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు మరియు ఇతర ప్రభుత్వ శాఖల ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ మరియు ప్రజల భద్రత దృష్ట్యా పలు సూచనలు జారీ చేశారు.ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపిన ముఖ్యమైన నిబంధనలు:ముందస్తు అనుమతి తప్పనిసరి,గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్, విద్యుత్ శాఖ, మరియు మున్సిపల్/గ్రామ పంచాయతీ అధికారుల నుండి ముందస్తు అనుమతి పత్రాలను పొందాలి.ట్రాఫిక్ అంతరాయం కలగవద్దు: రోడ్లపై రాకపోకలకు ఇబ్బంది కలిగేలా, వాహనాల రాకపోకలను అడ్డుకునేలా మండపాలను ఏర్పాటు చేయకూడదు.డీజేలపై నిషేధం ధ్వని కాలుష్యం: రాత్రి వేళల్లో సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయం దాటిన తర్వాత మైకులు, ధ్వని కాలుష్య కారక పరికరాలను వాడకూడదు. డీజేల వాడకంపై కఠిన నిబంధనలు వర్తిస్తాయి.భద్రతా చర్యలు ఌ సీసీ కెమెరాలు ప్రతి మండపం వద్ద నిర్వాహకులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి వేళల్లో మండపం వద్ద కనీసం ఇద్దరు లేదా ముగ్గురు నిర్వాహకులు తప్పనిసరిగా కాపలా ఉండాలి. పోలీస్ స్టేషన్ నుండి తప్పకుండా అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ తెలిపారు. శోభయాత్ర సమయములో ఎవరైనా శాంతి భద్రతలకి విఘాతం కలిగించినట్లయితే చట్టపరముగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

## కవి పురుషుడు కాళోజి

నిజం న్యూస్ హైదరాబాద్ సెప్టెంబర్ 8: ప్రజలందరి గొడవను
తన గొడవగా
ప్రతిఘటించిన
కవితా నాయకుడతడు
చందస చాందసాలనురికంభమెక్కించి
మాతృభాష మాండలికమే
మా సాహిత్యం, సంపదలని
యాస పట్టంగట్టిన దిక్సూచతడు
చూసి ఊరకుండని
సాక్షీభూతుడుగుండక
సాహిత్య సాకిరేవుతో
మురికివదిల్చిన మానవుడు
ఓట్లకరువుతో పెత్తనాలు చచ్చు
గద్దె జారు కిటుకుజెప్పి
ఆదుకొనే అవకాశం హరిహరులకు లేదంటూ
హరిహరుడే మానవుడై
అవినిని కాపాడాలని
దిగులు పడని హితవాది
దొంగకూడా మనింటోడే
పరాయోడు లేడంటు
దుమారంగ ఉప్పెనగ
తిరుగుబాటు రావాలెని
నిర్భయలై గద్దెదింప
విప్లవాలు రావాలని
తెలంగాణా కావ్యక్షేత్రాన
గర్జించి కవిపురుషుడు



(కాళోజీ నారాయణరావు జయంతి , తెలంగాణ భాషా దినోత్సవ సందర్భంగా)
– కొండూరి కోటి బాబు
ఎంఎ, జర్నలిజం విద్యార్థి, హైదరాబాద్.

## ఐకియా ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ మౌలిక వసతుల పరిశీలన..!



**నిజం న్యూస్ హైదరాబాద్, సెప్టెంబర్ 8:** డీసీపీ ట్రాఫిక్, ఏడీసీపీ ట్రాఫిక్, సీనియర్ ట్రాఫిక్ అధికారులు, టీజీఐఐసీ అధికారులు మరియు సంబంధిత సిబ్బందితో కలిసి ఐకియా ఫ్లైఓవర్‌తో పాటు ఐటీసీ నుంచి ఐకియా వరకు ఉన్న అనుసంధాన రహదారి మార్గాలను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న రహదారి పరిస్థితులు, ట్రాఫిక్ అవసరాలను అంచనా వేసేందుకు అవసరమైన కొలతలను అధికారులు తీసుకున్నారు.పరిశీలనలో భాగంగా ట్రాఫిక్ రాకపోకలు మరింత సులభంగా, సురక్షితంగా సాగేందుకు కొన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, అవసరమైన మార్పులు చేపట్టాల్సిన అవసరాన్ని గుర్తించారు. ప్రస్తుత ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా రహదారి మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని టీజీఐఐసీ కమిషనర్ దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్లారు. ట్రాఫిక్ మౌలిక వసతులు -- మెరుగైన ప్రణాళిక -- సాఫీగా రాకపోకలు...

# మహిళా ఎం.ఎల్. ఏ ల పై అసభ్య ప్రవర్తనకు చందనగర్ లో కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన

సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలతో పాటు తెలంగాణ మహిళలకు సి.ఎం క్షమాపణ చెప్పాలి

చందానగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళలు కళ్ళకు గంతలు కట్టుకొని వినూత్న ఆందోళన

యావత్ మహిళా లోకానికి సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్

ఎం.ఎల్.ఏ ల మీద ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డ బొబ్బా నవతారెడ్డి




**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 8:** అసెంబ్లీ సాక్షిగా సీనియర్ మహిళా శాసనసభ్యులు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరు, నిరసనగా చందానగర్‌లో మహిళలు కదం తొక్కారు.ప్రభుత్వ తీరుని తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం చందానగర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకురాలు బొబ్బా నవతారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. న్యాయం గుడ్డిది కాదు అని చాటేలా.. కళ్లకు నల్లటి గంతలు కట్టుకుని వినూత్న రీతిలో తమ నిరసన గళాన్ని వినిపించారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

### మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తారా?

ఈ సందర్భంగా బొబ్బా నవతారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి హోదాలో ఉన్న బాధ్యతాయుతమైన వ్యక్తి.. ఎంతో అనుభవం ఉన్న సీనియర్ మహిళా నేతలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను ఉద్దేశించి అసెంబ్లీలో చులకనగా మాట్లాడటం అత్యంత హేయమైన చర్య. ఇది కేవలం ఆ ఇద్దరు నేతలకు జరిగిన అవమానం కాదు.. యావత్ తెలంగాణ మహిళా లోకానికి జరిగిన అవమానం. మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న గౌరవం ఏంటో సీఎం ప్రవర్తన తో బట్టబయలైందని ఆమె మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు నిలదీస్తుంటే సహనంతో సమాధానం చెప్పాల్సిన ముఖ్యమంత్రి, కక్షపూరితంగా వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్యానికే చీకటి రోజని దుయ్యబట్టారు.

### బేషరతుగా క్షమాపణ చెప్పాలి..

కళ్లకు గంతలు కట్టుకుని నిలబడిన మహిళల ఆవేదనను ఈ ప్రభుత్వం అర్థం చేసుకోవాలని బొబ్బా నవతారెడ్డి పేర్కొన్నారు. మహిళా నేతలను అవమానించేలా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి తన తప్పును తెలుసుకుని, తక్షణమే బేషరతుగా వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఎవరు మాట్లాడినా చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. సీఎం స్పందించి బహిరంగ క్షమాపణ చెప్పకపోతే, రానున్న రోజుల్లో మహిళలందరినీ ఏకతాటిపైకి తెచ్చి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి,శభన,శరీన్, శోభ,రాధ,సీనియర్ నాయకులు కోమండ్ల శ్రీనివాస్ రెడ్డి,శ్రీకాంత్,సంగారెడ్డి, రాజన్న,రామకృష్ణ గౌడ్,అల్లఉద్దీన్,శివరాజ్,చందర్ రావు, గౌస్,అంజి,శేఖర్,మరియు, స్థానిక మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 15 టన్నుల దిగుబడితో రూ. 3,45,000 ఆదాయం.. ముస్తాబాద్ మండలం నామాపూర్‌లో ఆదర్శ రైతు ఆయిల్ పామ్ సాగు



**ముస్తాబాద్ ప్రతినిధి/ నిజం న్యూస్:** ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన రైతు అరవెల్లి చంద్రశేఖర్ రావు ఏడు ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటి దాదాపు నాలుగు ఏండ్ల తరువాత 15 టన్నుల దిగుబడి సాధించి రూ. 3,45,000 ఆదాయం పొందారు. మొక్కలు నాటి సస్య రక్షణ చర్యలు చేపట్టి మంచి దిగుబడి సాధించిన ఆయన, ప్రస్తుతం మరో రెండు ఎకరాల్లో మామిడి, నిమ్మ తోటలను కూడా సాగు చేస్తున్నారు. ఈ ఆదర్శ రైతు వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో మొక్కలు, దిగుబడిని పరిశీలించిన కలెక్టర్.. మరో పంట ఎప్పుడు చేతికి వస్తుందని అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో ఆయిల్ పామ్ వేశారు, మొక్కలు ఎక్కడి నుంచి తెచ్చారు, డ్రిప్ ఇరిగేషన్, సస్య రక్షణ చర్యలు, పెట్టుబడి, ఆదాయం తదితర అంశాలపై ఆరా తీసి ఆ రైతును అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రైతులు దీర్ఘకాలిక ఆదాయం సమకూర్చే ఆయిల్ పామ్ సాగు వైపు వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మొదటి మూడేండ్లపాటు ఉద్యానవన శాఖ అధికారుల సూచనల మేరకు అంతర పంటలుగా కూరగాయలు, పూల మొక్కలు, పండ్ల మొక్కలు సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని స్పష్టం చేశారు. ఆయిల్ పామ్ సాగులో కోతుల బెడద, చీడపీడల ఇబ్బందులు ఉండవని తెలిపారు. ప్రస్తుతం ఆయిల్ టన్ను ధర రూ. 24,025గా ఉందని వెల్లడించారు. జిల్లాలో నామాపూర్, బోయినపల్లి, నేరెళ్ల, సిరిసిల్ల ప్రాంతాలలో ఆయిల్ పామ్ కలెక్షన్ కేంద్రాలు ఉన్నాయని, ఇక్కడి ఉత్పత్తులను సిద్దిపేట జిల్లా నర్మెట్ట వద్ద ఉన్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నట్లు తెలిపారు. ఎక్కువ మంది రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వస్తే మరిన్ని కలెక్షన్ కేంద్రాలు ప్రారంభిస్తామని వివరించారు. నామాపూర్ రైతు ఆయిల్ పామ్‌తో పాటు మామిడి, నిమ్మ తోటలు సాగు చేయడం ద్వారా మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, ఏడీఏ ప్రదీప్, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ లచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగించొద్దు!

ఎస్ఐఆర్ ప్రక్రియపై సూరారంలో ధర్నా --
పారదర్శకతకు స్థానికుల డిమాండ్




**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 8:** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసులు, ఆధారాల సమర్పణ విషయంలో నెలకొన్న గందరగోళాన్ని తొలగించి, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సూరారం కాలనీలో ధర్నా నిర్వహించారు. నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో సూరారం కాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవన్ ఎదుట ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ, ఎస్సైఆర్ ప్రక్రియలో అనేక మంది ఓటర్లకు నోటీసులు అందుతున్న నేపథ్యంలో సాధారణ ప్రజల్లో ఆందోళన నెలకొందన్నారు. ముఖ్యంగా పేదలు, నిరక్షరాస్యులు, స్వంత ఇళ్లు లేని వారు, వలస కార్మికులు వంటి వర్గాల వద్ద అవసరమైన అన్ని పత్రాలు అందుబాటులో ఉండకపోవచ్చని పేర్కొన్నారు. సరైన పత్రాలు అందుబాటులో లేని కారణంగా అర్హులైన ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకూడదు. అధికారిక డేటా నమోదు సమయంలో కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా జరిగే పొరపాట్లకు ఓటర్లు బాధ్యత వహించాల్సిన పరిస్థితి రాకూడదు" అని ఆయన అన్నారు. 1987 కన్నా ముందు అధికారిక పత్రాలు కావాలంటే ప్రస్తుతం వారి వయసు 50, 60 సంవత్సరాలకు పైబడి ఉండాలని, ఈ లోపు వయస్సున్న వారికి ఎలాంటి పత్రాలు అందుబాటులో ఉండవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు వంటి పత్రాల విషయంలో ప్రజల్లో ఉన్న సందేహాలను అధికారులు స్పష్టంగా నివృత్తి చేయాలని, అర్హులైన ఓటర్లకు తమ వివరాలను సరిదిద్దుకునేందుకు తగిన అవకాశం కల్పించాలని కోరారు. ఓటరు పేరు తొలగించే ముందు సంబంధిత వ్యక్తికి సమాచారం ఇచ్చి, తన వాదన వినిపించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సైఆర్ ప్రక్రియపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, పేదలు మరియు సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ధర్నాలో పాల్గొన్న పలువురు కోరారు. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షించబడేలా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఈ అంశంపై పునరాలోచించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు చంద్రశేఖర్, రాము, రామకృష్ణ, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, సమన్వయంతో నిర్వహించుకోవాలి: రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా




**రామగుండం ప్రతినిధి / నిజం న్యూస్:** గణేష్ చతుర్థి పర్వదినం సందర్భంగా ఈ నెల 14న ప్రారంభమై, 25న నిమజ్జనంతో ముగియనున్న గణేష్ ఉత్సవాలను అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లకు చెందిన హిందూ మత పెద్దలు, గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సీపీ అధ్యక్షతన కాన్ఫరెన్స్ హాల్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటు నుంచి మండపాల నిర్వహణ, రవాణా, భక్తుల రద్దీ నియంత్రణ, శోభాయాత్ర, నిమజ్జనం వరకు ప్రతి దశలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తెలంగాణ పోలీస్ శాఖ గణేష్ మండపాల పర్యవేక్షణ కోసం ప్రత్యేక ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిందని, మండలాలు, విగ్రహాల ఎత్తు, నిర్వాహకుల వివరాలు, రూట్ మ్యాప్ తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి జియోట్యాగింగ్ ద్వారా 'టీజీ-కాప్' పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామని వెల్లడించారు. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

### మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలు:

**అనుమతులు - రిజిస్ట్రేషన్:** విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి. ప్రతి మండప కమిటీ అధ్యక్షుడు బాధ్యత వహిస్తూ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

**ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా:** ప్రజల, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలి.

నిరంతరం పర్యవేక్షణ: ప్రతి విగ్రహం వద్ద 24 గంటలు ఇద్దరు వ్యక్తులు అందుబాటులో ఉండాలి. బ్లూ కోట్స్, పెట్రోల్ కార్ సిబ్బంది ద్వారా తనిఖీలు నిర్వహించబడతాయి.

నిషేధాలు: మండపాల పేరుతో లక్కీ డ్రాలు, జూదం నిర్వహించకూడదు. ఎవరినీ బలవంతంగా చందాలు అడగరాదు. మండపాల వద్దకు ఎవరూ మద్యం సేవించిరాకుండా చూసుకోవాలి.

**విద్యుత్ భద్రత:** విద్యుత్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. నాణ్యమైన వైర్లు, పరికరాలు వాడి షార్ట్ సర్క్యూట్లు, అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, నీటి బకెట్లు అందుబాటులో ఉంచాలి.

**డీజేలు - సాంస్కృతిక కార్యక్రమాలు:** డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదు. ఇతర మతాలను కించపరిచే ప్రసంగాలు, పాటలకు పూర్తిగా దూరంగా ఉండాలి.

సోషల్ మీడియా హెచ్చరికలు: సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, పుకార్లు సృష్టించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా డయల్-112ను లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలి. సమస్యాత్మక ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను సీపీ ఆదేశించారు. పండుగలో ఆనందం వెల్లివిరియాలని, విషాదానికి తావులేకుండా అందరూ సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏసీపీలు ఏ. వెంకటేశ్వర్లు, టి. ప్రవీణ్ కుమార్, రామగుండం సీఐ కృష్ణ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐలు భూమేష్, చంద్రశేఖర్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ దుర్గం చెరువు



సైకో ఇచ్చిన వన్ మినిట్ టాస్క్‌ను సక్సెస్‌ఫుల్‌గా కంప్లీట్ చేశాడు ఇన్‌స్పెక్టర్ రుద్ర.ఇంతలో దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మీద ఓ పిల్లాడు వేలాడుతున్నట్టు రుద్రకు సమాచారం వచ్చింది. దీంతో టీమ్‌తో అక్కడికి ప్రయాణమయ్యాడు. దారిలో వెళ్తున్న రుద్రకు 'ఆ పిల్లాడిని మామూలుగా వదిలేస్తే కిక్ ఏముంది చెప్పు??' అన్న సైకో మాటలే మెదడులో గిర్రున తిరుగుతున్నాయ్. అంటే, నెక్స్ట్ విడిచిపెట్టే పిల్లాడిని అంత ఈజీగా సైకో వదిలిపెట్టడని అర్థమైపోయింది. పది నిమిషాల్లో దుర్గం చెరువు వచ్చింది. కేబుల్ బ్రిడ్జి మీదినుంచి ఓ పెద్ద సంచిలో ఓ పిల్లాడిని ఎవరో వేలాడదీశారు. అయితే, సంచిలో ఎలాంటి కదలికలూ కనిపించలేదు. బ్రిడ్జి మీదినుంచి వేలాడుతున్న పిల్లాడిని ఎందుకు పైకి లాగలేదని రుద్ర అక్కడ ఉన్న సిబ్బందిని గద్దించాడు. దీంతో సంచికి కట్టిన తాడు మొదట్లో ఓ లెటర్ అతికించి ఉందన్న విషయాన్ని రుద్రకు చెప్పారు అక్కడి కానిస్టేబుల్స్. బ్రిడ్జ్ మీదికి ఏ వాహనాలూ రాకుండా ట్రాఫిక్‌ను మళ్లించి ఆ లెటర్ చదవడం ప్రారంభించాడు.

'హలో రుద్రా.. పిల్లల్లో ఒకడిని ఈ సంచిలో పెట్టి వేలాడదీసింది నేనే. సీసీటీవీ ఫుటేజీ వగైరా అంటూ టైమ్ వేస్ట్ చేసుకోకుండా నేను ఇచ్చే రెండు పజిల్స్‌ను నిమిషంలో సాల్వ్ చెయ్యి. ఒకవేళ జవాబు తప్పుగా చెప్పినా లేక, ఇన్‌టైమ్‌లో ఆన్సర్ చేయలేకపోయినా.. పిల్లాడికి కట్టిన తాడు దానంతట అదే ఊడిపోతుంది. పిల్లాడు అంతెత్తు నుంచి నీటిలో పడిపోతాడు. పాపం.. మత్తులో ఉన్నాడు కదా.. ఈత కొట్టే అవకాశం కూడా ఉండదు. మరో విషయం.. నీ పోలీసు బుద్ధితో ఇప్పుడే పిల్లాడిని విడిపించుకోవాలని చూస్తావేమో! ఆ ప్రయత్నం చేస్తే.. అబ్బాయే కాదు.. మొత్తం బ్రిడ్జి పేలిపోతుంది. మరి ఈ 'ఆపరేషన్ దుర్గం చెరువు'ను సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేస్తావా?' అంటూ లెటర్ ముగించాడు సైకో. ఇంతలో ఆకాశం నుంచి ఓ డ్రోన్ ద్వారా ఓ లెటర్ రుద్ర ముందు పడింది. దాన్ని తెరిచి చదవడం ప్రారంభించాడు రుద్ర. 'మిస్టర్ రుద్రా.. ఇప్పుడు టైమ్ రాత్రి 10.20 గంటలు. 10.30 గంటల నుంచి 10.31 గంటల వరకూ అంటే ఒక్క నిమిషంలో నేను అడిగే పజిల్‌కు నువ్వు ఆన్సర్ చేయాలి. క్వశ్చన్లు సరిగ్గా 10.30 గంటలకు ఈ డ్రోన్ నుంచి ఓ లెటర్ రూపంలో కింద పడతాయి. నువ్వు ఆన్సర్స్‌ను డ్రోన్‌లోని వాయిస్ రికార్డర్‌కు వినిపించేంత గట్టిగా ఒక్క నిమిషంలో చెప్పాలి. సమాధానం కరెక్ట్ అయితే.. పిల్లాడు, బ్రిడ్జి రెండూ సేఫ్.. లేదంటే.. పిల్లాడు, బ్రిడ్జ్ రెండూ ఫినిష్! వెయిట్ ఫర్ మై క్వశ్చన్స్' అని రాసి ఉంది. దీంతో రుద్ర హార్ట్‌బీట్ మరింతగా పెరిగింది. సమయం.. రాత్రి 10.30 గంటలు. డ్రోన్ నుంచి ఓ లెటర్ కిందపడింది. అందులో ఇలా ఉంది.. 'రుద్రా.. మొదటి ప్రశ్న.. సునందకు నలుగురు కూతుళ్లు. ప్రతీ కూతురికి ఒక బ్రదర్ ఉన్నాడు. ఇప్పుడు సునందకు ఎంతమంది పిల్లలు ఉన్నారో.. సంచిలో ఉన్న ఈ అబ్బాయి ఇంట్లో కూడా అంతమంది ఉంటారు. ఈ అబ్బాయి ఎవరి కొడుకు? రెండో ప్రశ్న.. కుడి చెయ్యి చేసే ప్రతీ పనిని.. ఎడమ చెయ్యి కూడా చేయగలదు. అయితే ఒక్కపని తప్ప. అదేంటో గట్టిగా అరిచి చెప్పు' అని ఉంది. ప్రశ్నలు చదవడానికే అర నిమిషం పూర్తయింది. దీంతో అప్రమత్తమైన రుద్ర.. ఐదుగురి పిల్లల పేరెంట్స్‌ను వెంటనే పిలిచి.. ఎవరింట్లో ఎంతమంది ఉంటారో అడిగాడు. మొదటి వ్యక్తి 8, రెండో వ్యక్తి 9, మూడోవ్యక్తి 5, నాలుగో వ్యక్తి 6, ఐదో వ్యక్తి ఏడుగురు అని సమాధానం చెప్పారు. దీంతో సంచిలో ఉన్న పిల్లాడు ఎవరి కొడుకో రుద్ర గట్టిగా అరిచి చెప్పాడు. ఇంకో పది సెకండ్ల టైమ్ మాత్రమే మిగిలి ఉంది. కుడి చెయ్యి-ఎడమ చెయ్యి పజిల్‌కు ఆన్సర్ ఏంటో రుద్రకు స్ఫురించట్లేదు. ఏమైతుందోనని అంతా ఒకటే టెన్షన్. ఇంతలో ఏదైతే అదైందని తాను అప్పటికప్పుడు అనుకొన్న ఆన్సర్‌ను గట్టిగా అరిచి చెప్పాడు రుద్ర. అయితే, గాలి గట్టిగా వీయడంతో వాయిస్ రికార్డర్‌కు ఆ శబ్దం వినబడలేదు. దీంతో మరో మూడు సెకండ్లు ఉండగా.. రుద్ర మళ్లీ గట్టిగా అరిచి రెండో పజిల్ ఆన్సర్ చెప్పాడు. టైమ్ పూర్తయ్యింది. తాను చెప్పిన ఆన్సర్లు కరెక్ట్.. అవునా? కాదా? అని రుద్రతో పాటు అందరూ టెన్షన్‌తో ఎదురు చూస్తున్నారు.

రెండు నిమిషాల తర్వాత మరో డ్రోన్ అక్కడికి వచ్చి ఓ లెటర్‌ను కిందకు విసిరేసింది. 'బ్రిలియంట్ రుద్ర. నా రెండు పజిల్స్‌కు నువ్వు కరెక్ట్‌గా ఆన్సర్ చేశావ్. సో.. ఆపరేషన్ దుర్గం చెరువు సక్సెస్. ఇక ఈ పిల్లాడిని నువ్వు తీసుకెళ్లొచ్చు. అయితే, ఈ పిల్లాడిని నువ్వు వాళ్ల ఇంటికి తీసుకెళ్తావా? లేక శ్మశానానికా? మరిన్ని వివరాల కోసం.. నీ మొబైల్‌లో మెసేజ్ చూడు' అని ఆ లెటర్‌లో ఉంది. అది చదవగానే రుద్ర కాళ్లకింద భూకంపం వచ్చినంత పనైంది. అంతలోనే ఓ ఇంటర్నెట్ స్పామ్ నంబర్ నుంచి అప్పుడే రుద్ర ఫోన్‌కు మెసేజ్ డెలివరీ అయ్యింది. కంగారుగా ఓపెన్ చేశాడు రుద్ర 'హాయ్ రుద్రా.. టెన్షన్ అంటే ఏంటో మొదటిసారి చూస్తున్నావా? ఇది జస్ట్ ఫస్ట్ రౌండ్ మాత్రమే. అసలు ఆట ముందు ఉంది. ఈ పిల్లాడికి నేను ఓ ఇంజెక్షన్ ఇచ్చా. అయితే, ఎలాంటి విషాన్ని, మందును, కనీసం నీళ్లను కూడా నేను ఆ బాబు ఒంట్లోకి ఎక్కించలేదు. అయినప్పటికీ కొద్దిసేపట్లో అతను చనిపోతాడు. అసలేం జరిగిందో టెస్టులు చేసి డాక్టర్లు తెలుసుకొనే లోపే పిల్లాడి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. అందుకే, ఈ బాబును డైరెక్టుగా శ్మశానానికి తీసుకుపో.. లేదు. కాపాడతా అంటావా? అయితే, నా ఇన్ఫర్మేషన్‌లోనే ఆన్సర్ ఉంది. దమ్ముంటే కాపాడుకో' అని ఆ మెసేజీలో ఉంది. దీంతో కంగారు పడిపోయిన రుద్ర.. హుటాహుటిన పిల్లాడిని హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. టెస్టులకు సమయం పడితే, పిల్లాడి ప్రాణాలకే ప్రమాదం అని గ్రహించిన రుద్ర.. సైకో ఇచ్చిన ఇన్ఫర్మేషన్‌ను డీకోడ్ చేసి అసలు సమస్యేంటో డాక్టర్స్‌కు చెప్పాడు. దీంతో ఆ డైరెక్షన్‌లోనే టెస్టులు చేసిన వైద్యులు సమస్య అదే అని కనిపెట్టారు. సకాలంలో వైద్యం చేయడంతో పిల్లాడు ప్రాణాలతో బతికి బయటపడ్డాడు. ఇంతకీ, సైకో అడిగిన రెండు పజిల్స్‌కు సమాధానమేంటి? పిల్లాడికి సైకో ఏ ఇంజెక్షన్ ఇచ్చినట్టు? దాన్ని రుద్ర ఎలా కనిపెట్టినట్టు??

**సమాధానం:** మొదటి పజిల్‌లో సునందకు నలుగురు కూతుళ్లు అని సైకో చెప్పాడు. ప్రతీ కూతురికి ఒక బ్రదర్ అని కూడా చెప్పాడు. అంటే ఈ లెక్కన సునందకు నలుగురు కూతుళ్లు, ఒక కొడుకు. అంటే సునందకు మొత్తం ఐదుగురు సంతానం. మూడో వ్యక్తి ఐదుగురు అన్నాడు. అంటే అతనే పిల్లాడి తండ్రి. ఇక, రెండో పజిల్‌లో కుడి చెయ్యి చేసే ప్రతీ పనిని.. ఎడమ చెయ్యి కూడా చేయగలదు. అయితే ఒక్కపని తప్ప అని సైకో అడిగాడు. ఎడమ చెయ్యి తన మోచేతిని తాకలేదు. అయితే, కుడి చెయ్యి ఎడమ చెయ్యి మోచేతిని తాకగలదు. ఇదే ఆన్సర్. దీన్ని రుద్ర కరెక్ట్‌గా చెప్పాడు. ఇక, ఎలాంటి విషాన్ని, మందును, కనీసం నీళ్లను కూడా లేని ఇంజెక్షన్‌ను పిల్లాడికి ఇచ్చానని సైకో చెప్పాడు. అంటే పిల్లాడికి సైకో ఎయిర్ ఎంబ్లాయిజమ్ (రక్త నాళాల్లోకి గాలిని ఎక్కించడం) చేశాడని రుద్ర కనిపెట్టాడు. డాక్టర్లకు ఆ విషయాన్ని చెప్పడంతో సకాలంలో చికిత్స అంది పిల్లాడు బతికి బయటపడ్డాడు.

# కరీంనగర్‌లో ఘనంగా గణేష్ ఉత్సవాలు పకడ్బందీ ఏర్పాట్లకు అధికారుల ఆదేశం






**కరీంనగర్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** కరీంనగర్‌లో ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యే గణేష్ నవరాత్రి ఉత్సవాల నుంచి నిమజ్జనం వరకు ప్రతి అంశాన్ని పక్కా ప్రణాళికతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలమ్‌తో కలిసి కలెక్టర్ ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై సమీక్షించారు. కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు హుజురాబాద్, చొప్పదండి, జమ్మికుంట మున్సిపాలిటీల్లో చేపడుతున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఏడాది జిల్లాలో గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకుంటున్నామని, అదే సంప్రదాయాన్ని ఈసారి కూడా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులు ప్రతి గణేష్ మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ సరఫరా, నిమజ్జన పాయింట్ల వద్ద భద్రత, తాగునీరు, లైటింగ్, పారిశుధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి గణేష్ మండపానికి ఉచిత విద్యుత్ కనెక్షన్ అందిస్తుందని, లైన్‌మెన్ ద్వారా కనెక్షన్లు ఏర్పాటు చేస్తారని తెలిపారు. ప్రజలు స్వయంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకుని ప్రమాదాలకు గురికావద్దని సూచించారు.

### నిమజ్జన పాయింట్ల వద్ద 'పక్కా' ఏర్పాట్లు

జిల్లాలోని ప్రతి నిమజ్జన పాయి?ట్ వద్ద అవసరమైన మేరకు బ్యారికేడ్లు, క్రేన్లు, లైటింగ్, విద్యుత్, తాగునీరు వంటి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పాయి?ట్ వద్ద మెడికల్ క్యాంపు, 108 వాహనం అందుబాటులో ఉంచాలని సూచించారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. క్రేన్లకు అదనపు డ్రైవర్లు, మెకానిక్‌లను సిద్ధంగా ఉంచాలని, నిమజ్జనం రోజున ఉదయం 6 గంటలకే క్రేన్లు సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన సంఖ్యలో గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించాలని కలెక్టర్ సూచించారు. సెప్టెంబర్ 23న ప్రధాన నిమజ్జన కార్యక్రమాలు జరగనున్న నేపథ్యంలో విగ్రహాల ఊరేగింపు రూట్ మ్యాప్‌ను ముందుగానే ఖరారు చేయాలని ఆదేశించారు. నిమజ్జనం సందర్భంగా మద్యం విక్రయాలకు అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

### పోలీసుల నిఘా.. కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ

పోలీస్ కమిషనర్ గౌష్ ఆలమ్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరపున పకడ్బందీ బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కరీంనగర్ నగరంలోని వినాయక విగ్రహాలను మానకొండూరు, కొత్తపల్లి, చింతకుంట ప్రాంతాల్లో నిమజ్జనం చేయనున్నట్లు పేర్కొన్నారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ శాఖతో పాటు విద్యుత్, మున్సిపల్, వైద్య, ఇతర శాఖల అధికారులతో కలిసి ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. మండపాలు, నిమజ్జన ప్రాంతాల్లో ఏదైనా సమస్య తలెత్తితే కంట్రోల్ రూమ్ ద్వారా సమాచారం అందుకుని వెంటనే స్పందించేలా వ్యవస్థను సిద్ధం చేస్తున్నట్లు వె వెల్లడించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో స్వామి, ఆర్డీవోలు షర్మిల, జలకుమారి, ఏసీపీలు వెంకటస్వామి, విజయ్‌కుమార్, యాదగిరిస్వామి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజగోపాల్‌రావు, డీపీవో జగదీశ్వర్, జిల్లా మత్స్యశాఖ అధికారి విజయభారతి, గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కే. మహేశ్వర్, రాధాకృష్ణారెడ్డి, జిల్లా అధికారులు, పుర ప్రముఖులు, పీస్ కమిటీ సభ్యులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ ప్రత్యర్థుల చావు కోరుకోవడం దుర్మార్గం.. ప్రజా సమస్యలను గాలికొదిలేసి సభా సమయం వృథా చేస్తున్నాయి: తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగా ఢీకొట్టాలే తప్ప, చావు కోరుకోవడం ఏమిటని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నోటి దురుసుతో ప్రత్యర్థి నాయకులను, కులాలను, వ్యవస్థలను దూషించడం, దుర్భాషలాడటం ఇదే మొదటిసారి కాదని, అలాంటి నాయకుడిపై కాంగ్రెస్ పార్టీ ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం లేదని ఆమె ప్రశ్నించారు. అంటే ఆయన దూషణలను కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందా అని నిలదీశారు. ప్రతిపక్ష నాయకుడి ఇంటిపైకి అధికార పార్టీ నాయకులు దండయాత్రకు వెళ్లడం ఏమిటని, ఒక ముఖ్యమంత్రే తన పార్టీ నాయకులను ఇలాంటి దాడికి ఉసిగొల్పడం ఏంటని, రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఏం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారని కవిత ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అందక విద్యార్థులు ఇబ్బంది పడుతుంటే, 22ఏ నిషేధిత భూముల జాబితాలో తమ భూములు నమోదు కావడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు రాక, జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడంతో నిరుద్యోగులు నిరాశలో ఉండగా, యూరియా దొరకక రైతులు అల్లాడిపోతున్నారు. జీవో 97ను రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థులు కోరుతుంటే, వరుసగా జరుగుతున్న అఘాయిత్యాలు, హత్యాచారాలతో మహిళలు భయంభయంగా బతుకుతున్నారు. నాణ్యమైన భోజనం, వసతులు లేక గురుకులాల విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటుండగా, పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏలు సహా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఇలా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే, అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు మాత్రం గత రెండు రోజులుగా విలువైన సభా సమయాన్ని వృథా చేశాయని కవిత తప్పుబట్టారు. ఇప్పటికైనా రేపటి నుంచి అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చ జరగాలని, వాటికి పరిష్కారం చూపించే దిశగా సభలో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# ఆధునాతన పంట విధానాలతో అధిక దిగుబడులు : వ్యవసాయ శాస్త్రవేత్తలు



ఆధునాతన పంట విధానాలతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రియా, సుధీర్, శ్రీకృష్ణ, దిలీప్ అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రధానంగా రైతులలో అభివృద్ధి చెందిన వ్యవసాయ సాంకేతికత, స్థిరమైన వ్యవసాయ విధానాల ద్వారా దిగుబడిని, ఆదాయాన్ని పెంచవచ్చని వివరించారు. అధిక దిగుబడి, అధిక లాభం కలిగించే తోటల సాంకేతికతలు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతికత ప్రయోగాలపై రైతులకు వివరించారు. వ్యవసాయం, వనరుల సమర్థ వినియోగం, పంట ఆరోగ్యంపై నిఘా, ఆటోమేటెడ్ నీటి పారుదల వ్యవస్థలు, మెరుగైన వ్యవసాయ విధానాల గురించి నిపుణులు వివరించారు. ఇందులో ముఖ్యంగా రైతుల పొలాల నుంచి మట్టి నమునాలను శాస్త్రీయంగా సేకరించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం, ఏఈవో గీత, ఉద్యానవన శాఖ అధికారి కీర్తికృష్ణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పాలకూర జ్యూస్‌ను తాగుతున్నారా..? అయితే ఈ జాగ్రత్తలను పాటించాల్సిందే..!



పాలకూర మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటుంది. పాలకూరతో చేసే వంటలను అందరూ ఎంతో ఇష్టంగా తింటారు. దీంతో అనేక కూరలు, ఇతర వంటకాలను చేయవచ్చు. ఆరోగ్యంగా ఉండాలంటే పాలకూరను తరచూ తినాలని పోషకాహార నిపుణులు కూడా చెబుతుంటారు. పాలకూరలో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. దీన్ని పోషకాలకు నెలవుగా అభివర్ణిస్తుంటారు. పాలకూరను రోజూ తినడం కన్నా జ్యూస్ చేసి తాగితే మేలు అని చాలా మంది భావిస్తుంటారు. ఉదయం పరగడుపునే దీని జ్యూస్‌ను తాగుతుంటారు కూడా. అయితే పాలకూర జ్యూస్‌ను రోజూ తాగే వారు కొన్ని జాగ్రత్తలను తప్పక పాటించాలని, లేకపోతే లాభం కలగకపోగా నష్టం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇక ఆ జాగ్రత్తలు ఏమిటంటే..

### రోజుకు ఎంత తాగాలి..?

పాలకూర జ్యూస్‌ను రోజుకు 120 నుంచి 240 ఎంఎల్ మోతాదులోనే తాగాలని, అంతకు మించి తాగకూడదని పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాలకూర జ్యూస్‌ను వారంలో 3 లేదా 4 సార్లు తాగితే చాలు, రోజూ తాగాల్సిన పనిలేదని వారు అంటున్నారు. కేవలం పాలకూర జ్యూస్‌ను మాత్రమే కాకుండా దాంతోపాటు ఇతర పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను తీసుకుంటే సమతుల ఆహారం లభిస్తుందని వారు అంటున్నారు. అయితే పాలకూర జ్యూస్‌ను ఎప్పుడూ ఒక పోషక పదార్థంగా భావించాలి తప్ప తినే ఆహారానికి బదులుగా కేవలం ఈ జ్యూస్‌ను మాత్రమే తాగి ఉండకూడదని అంటున్నారు. ఇతర ఆహారాలను కూడా తినాలని వారు సూచిస్తున్నారు.

### విటమిన్ సి అందేలా..

పాలకూర జ్యూస్‌తోపాటు విటమిన్ సి లభించేలా చూసుకోవాలి. దీంతో పాలకూరలో ఉండే ఐరన్‌ను శరీరం ఎక్కువగా శోషించుకుంటుంది. అందుకు గాను పాలకూర జ్యూస్‌లో కొద్దిగా నిమ్మ లేదా నారింజ రసం కలిపి తాగాల్సి ఉంటుంది. దీంతో ఐరన్ సమృద్ధిగా లభించి రక్తం అధికంగా తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. ఎర్ర రక్త కణాలు ఆరోగ్యంగా ఉంటాయి. పాలకూర జ్యూస్‌ను నేరుగా తాగితే జీర్ణ వ్యవస్థపై భారం పడే అవకాశం ఉంటుంది. కనుక అందులో కొద్దిగా ఏదైనా ఇతర పండ్ల రసం లేదా నీరు కలిపి తాగితే మంచిది. పాలకూర జ్యూస్‌ను తాగడం కొత్తగా మొదలు పెట్టేవారు ముందు చిన్న మొత్తంలో తాగడం మంచిది. తరువాత ఎక్కువ పరిమాణం పెంచవచ్చు. లేదంటే జీర్ణ వ్యవస్థపై భారం పడే అవకాశం ఉంటుంది.

### వీరు తాగకూడదు..

కిడ్నీ స్టోన్లు ఉన్నవారు లేదా మూత్రాశయం, కిడ్నీ సమస్యలు ఉన్నవారు పాలకూర జ్యూస్‌ను తాగకూడదు, పాలకూరను కూడా తినకూడదు. రక్తాన్ని పలుచగా చేసే మందులను వాడేవారు కూడా ఈ జ్యూస్‌ను తాగకూడదు. కొందరికి ఫుడ్ అలర్జీలు ఉంటాయి. అలాంటి వారు డాక్టర్ సూచన మేరకు పాలకూర జ్యూస్‌ను తాగాల్సి ఉంటుంది. పాలకూర జ్యూస్‌ను తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది, క్యాన్సర్ కణాల పెరుగుదల ఆగిపోతుంది. కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి చూపు మెరుగు పడుతుంది. బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ జ్యూస్ ఎంతగానో మేలు చేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు.

# నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'చికెన్ అండ్ ఎగ్ స్టాల్స్' పంపిణీ



**కరీంనగర్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** కరీంనగర్ నగరంలో చిరు వ్యాపారులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే దిశగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో "చికెన్ అండ్ ఎగ్ స్టాల్స్" పంపిణీ కార్యక్రమం మున్సిపల్ ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మరియు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరై.. 10 మంది లబ్ధిదారులకు ఈ ఆధునిక స్టాల్స్ ను పంపిణీ చేశారు. మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) మరియు జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ నెక్ సంయుక్త సహకారంతో ఈ ఆకర్షణీయమైన "చికెన్ అండ్ ఎగ్ స్టాల్స్" లను రూపొందించడం జరిగింది. ప్రజల్లో పౌష్టికాహారం పట్ల అవగాహన పెంచేందుకు స్టాల్స్ పై ప్రత్యేకంగా "ప్రతి రోజు రెండు కోడి గుడ్లు తినండి – రోగాలకు దూరంగా ఉండండి", మరియు "వంద శాతం కల్తీలేని అధిక పోషక విలువలు కలిగిన కోడి గుడ్డు" వంటి సందేశాలను పొందుపరిచారు. అలాగే జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందిన "సండే హో యా మండే.. రోజ్ ఖావో అండే" నినాదాన్ని కూడా స్టాల్ పై ముద్రించారు. ఈ స్టాల్స్ ద్వారా చికెన్ మరియు కోడిగుడ్లతో చేసిన వివిధ రకాల వంటకాలను (ఆమ్లెట్, చికెన్ కబాబ్, చికెన్ ఫ్రైడ్ రైస్ తదితర) పరిశుభ్రమైన వాతావరణంలో విక్రయించేలా స్టాల్స్ కు ఆకర్షణీయమైన డిజైన్, మెనూ బోర్డులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పంపిణీ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సువార్త, కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల చంద్రశేఖర్, తాటి ప్రభావతి, రామన్, సొగాని కొమురయ్య, భారీ జితేందర్, సరిల్ల ప్రసాద్, నలువాల రవీందర్, వరాల నర్సింగం, చాడగొండ బుచ్చిరెడ్డి, మెప్మా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.